# అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు

- మధ్యవర్తుల ప్రమేయం అవసరం లేదు
- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని
- ఏలూరులో 73వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం



ఏలూరులో గడపగడపకూ కార్యక్రమంలో కుటుంబానికి సంక్షేమాన్ని వివరిస్తోన్న ఎమ్మెల్యే ఆళ్ల నాని చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : అర్హతే ప్రామాణికంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదవర్గాల కుటుంబాలకు అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు ఆయా వర్గాలకు వరంలా మారాయనీ, పేదల జీవితాలకు భరోసా కల్పించారని చెప్పారు. ఏలూరు నగరంలో 73వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఏలూరు 22వ డివిజన్ 26వ సచివాలయం పరిధిలోని శాంతినగర్ 7వ రోడ్డు, ఆదర్శనగర్, ఫిరంగుల దిబ్బ చెరువు ప్రాంతాల్లో ఆయన పాదయాత్రగా ఇంటింటికీ వెళుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో ఆరా తీశారు. 22వ డివిజన్ కార్పొరేటర్, నగర డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆళ్ల నానికి అపూర్వ స్వాగతం లభించింది. డివిజన్ నాయకులు, మహిళలు, యువత భారీ సంఖ్యలో హాజరై తమ అభిమాన నేతకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ళనాని మాట్లాడుతూ ప్రజలంతా నేడు ఎంతో సంతోషంగా ఉన్నారనీ, ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. మూడున్నరేళ్ళ కాలంలో ఆయన మేనిఫెస్టోలోని 90శాతం హామీలను అమలు చేసి చూపించారని, ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో జగనన్న పనిచేస్తున్నారని, మీరంతా మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు నైతికత లేకండా కుట్రలు, కుళ్ల రాజకీయాలు చేస్తూ పేదలకు చేసే మంచిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాబోయే 2024 ఎన్నికల్లో ప్రజలే గట్టిగా బుద్ధిచెప్పాలని ఎమ్మెల్యే నాని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ ఛైర్మన్ కంచన రామకృష్ణ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మంచెం మైబాబు, డైరెక్టర్లు కోరాడ బాబు, మేతర సురేష్, జక్కుల బెనర్జీ, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, బండారు కిరణ్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి, పోతర్లంక లక్ష్మణ్, యర్రంశెట్టి సుమన్, జయకర్, మదిరి విజయనిర్మల, పాలిమేర దాసు, దేవరకొండ శ్రీనివాస్, కత్తిరి రామ్మోహనరావు, కలవకొల్లు సాంబ, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఖైజర్ పాషా, లీగల్ సెల్ ఆచంట వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, ప్రత్తిపాటి తంబి, పార్టీ నాయకులు పాలిమేర హరికృష్ణ, జిజ్జువరపు రమేష్, నున్న కిషోర్, గూడూరి ప్రసాద్, నిడికొండ నరేంద్ర, వైఎస్‌వీ శివరావు, పారిపిరెడ్డి నాగేశ్వరరావు, తోలేటి శ్రీనివాస్, జేవియర్ మాస్టార్, మాజీ సర్పంచ్ జ్ఞానేష్, తోట శివ, మోటమర్రి సదానందం, లూటుకుర్తి సుభాష్, తోటకూర కిషోర్, పిట్టా ధనుంజయ్, అమీనా అన్సారీ, బోగిశెట్టి పార్వతి, తహసీల్దార్ సోమశేఖర్, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతీ, పీవో కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### భక్తి శ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



విశేష అలంకరణలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక అగ్రహారంలోని శ్రీ నగరేశ్వర స్వామి దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల పండ్ల రసాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 140 మంది మహిళలతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. తొలుత ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, స్థానిక కార్పొరేటర్, నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వర రావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందచేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు పర్యవేక్షించారు.

### సేవా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలో సాటి ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేస్తున్న వారి సేవలను గుర్తించి వారిని అవార్డులతో సత్కరించనున్నట్లు ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న వారిని ఎంపిక చేసి వారికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవా రత్న, మదర్ థెరిస్సా సేవా రత్న, విలియం కేరి సేవా రత్న, అబ్దుల్ కలాం సేవా రత్న అవార్డులు ప్రధానం చేస్తామన్నారు. దరఖాస్తులు పంపేవారు ఇతర వివరాల కోసం 6305683467 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఏలూరు (టూటౌన్): జిల్లా వ్యాప్తంగా వివిధ స్కూళ్లల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ వంట చేసే కార్మికులకు నెలకు రూ.10వేలు గౌరవ వేతనం చెల్లించాలన్నారు. మధ్యాహ్న వంటకు అవసరమైన వంట గ్యాస్‌ను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ పథకాలు వర్తింప చేయాలని కోరారు. స్కూల్ విద్యార్థులకు ఇస్తున్న మెస్ ఛార్జీలను పెంపుదల చేయాలని విజ్ఞప్తి చేసారు. ఆందోళన అనంతరం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో మద్దాల దుర్గమ్మ, నారపాం మనెమ్మ, ఎం.రమ్మ, డి.నిర్మల, కె.వెంకటేశ్వరమ్మ, డొక్కా కుమారి, నక్కా కృష్ణ వేణి, బి.మరియమ్మ, షేక్ నసీమా తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి డి.మధుసూధనరావును కలిసి వినతిపత్రం అందచేశారు. ఇటీవల నిర్వహించిన ఇటీవల నిర్వహించిన ఇంగ్లీష్ సబ్జెక్టు పదోన్నతులు తమ అందరి సమక్షంలో సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సిలింగ్ నిర్వహించినందున దానికి సంబంధించి రీ కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరం లేదని కోరారు. అయితే ప్రస్తుతం జరిగిన పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా విడుదలైన అన్ని సబ్జెక్టుల జాబితాలను రద్దు చేయాలని, అన్ని సబ్జెక్టుల సర్‌ప్లస్ ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలలకు కౌన్సిలింగ్ విధానంలో మాత్రమే సర్దుబాటు చేయాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారికి అంగీకార పత్రం సమర్పించిన వారిలో డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ. వెంకటేశ్వర రావు, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు జీజేఏ స్టీవెన్, మాసగిరి శ్రీనివాస్, ఫ్యాప్టో ఛైర్మన్ పీబీవీఎస్ఎల్ నారాయణ, పీఆర్‌టీయూ నాయకుడు పువ్వుల ఆంజనేయులు, యూటీఎఫ్ నాయకుడు పీవీ. నరసింహారావు, ఏపీటీఎఫ్ నాయకుడు ఎస్. రంగావలి, ఫ్యాప్టో నాయకుడు ఎం. ఆదినారాయణ ఉన్నారు.

### సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఏలూరు (టూటౌన్): నేటి యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ,నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ నందు బోస్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కిషోర్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ దేశానికి చేసిన సేవ మరువలేనిదన్నారు. ప్రిన్సిపాల్ రామరాజు మాట్లాడుతూ యువత దేశం పట్ల బాధ్యత భావం కలిగి ఉండాలని తద్వారా దేశభక్తిని చాటాలన్నారు. ఎస్ఏస్ఎస్ కో-ఆర్డినేటర్ ఇమ్మానియేలు మాట్లాడుతూ దేశ చరిత్రలో సుభాష్ చంద్రబోస్‌ది ప్రత్యేక స్థానం అని చెప్పారు. ముందుగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువతీ, యువకులు, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు పాల్గొన్నారు.

# స్పందనలో 214 అర్జీల స్వీకరణ

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్



స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ప్రభుత్వ పరంగా ప్రజలకు అందిస్తున్న పథకాలకు సంబంధించిన సమస్యలపై స్పందనలో అందజేస్తున్న అర్జీలపై అధికారులు స్పష్టమైన నాణ్యతమైన సమాచారాన్ని అందజేసి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జిల్లా రెవిన్యూ అధికారి ఏవీఎస్ఎస్ మూర్తి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జెడ్పీ సీఈవో ఆర్.రవికుమార్, ఆర్డీవో కె.పెంచలకిషోర్‌లతో కలిసి స్పందన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేస్తున్న అర్జీలకు సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వడంలో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యకమానికి 214 అర్జీలు స్వీకరించబడ్డాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు.

**స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలలో కొన్ని**

- పెదవేగి మండలం పినకడిమి గ్రామానికి చెందిన గడ్డం ఏసుపాదం డ్రైనేజీ మ్యాన్ హోల్స్ పూడిపోయనందున ఇళ్లలోకి మురుగునీరు వస్తున్నందున కాలనీవాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు.
- కైకలూరు మండలం పెదకొట్టాడ గ్రామానికి చెందిన మద్ద భాగ్యారావు తమ గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న మైనర్ ఇరిగేషన్ పంచాయితీ చెరువులలో చేపల పెంపకం, చేపలవేట, చేపలు పట్టుకోవడానికి గ్రామానికి చెందిన మత్స్యకారుల సంక్షేమ సంఘానికి లీజుకు ఇప్పించమని అర్జీ అందజేశారు.
- కామవరపుకోట మండలం రావికంపాడు గ్రామానికి చెందిన ఎం.నాగరాటాలు తమ గ్రామంలోని స్మశానంనకు పోవు మార్గంను కొందరు రైతులు ఆక్రమించారని ప్రభుత్వం వారు సర్వేయర్ తో సర్వే చేయించి మార్గం ఏర్పాటు చేయవలసినదిగా కోరుతూ అర్జీ అందజేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలను సక్రమంగా వినియోగించుకోవాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి జీ. రాజేశ్వరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : మానవుని మంచి మనుగడ కోసం అనేక చట్టాలు రూపొందించారని, ఈ చట్టాలను సక్రమమైన పద్ధతిలో వినియోగించుకొని మంచి జీవనం సాగించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వంగాయగూడెం సెంటర్‌లోని గంగానమ్మ నగర పాలక పాఠశాల ప్రాంగణంలో మహిళలు, 16వ డివిజన్ పరిధిలోని సచివాలయ గ్రామ వలంటీర్లను, ఉద్యోగస్తులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీల అభివృద్ధికి ఏర్పడిన చట్టాలను సక్రమమార్గంలో ఉపయోగించుకొని రక్షణ పొందాలని, అలాగే ఎవరికైనా ఏవిధమైన కుటుంబ వివాదాలు ఉన్నా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే బాలబాలికలను తప్పనిసరిగా బడికి పంపించాలని, పిల్లలకు మంచి చదువులు నేర్పడం ద్వారా వారికి ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని తెలియజేశారు. పేద బడుగు బలహీన వర్గాల వారికి, స్త్రీలకు, ప్రకృతి వైపరీత్య సంభవించినప్పుడు ఉచిత న్యాయ సహాయాన్ని న్యాయసేవాధికారి సంస్థ అందిస్తుందన్నారు. అటువంటి వారికి అవసరమైన పక్షంలో ఈ సేవలను ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అలాగే ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, కుటుంబ వివాదాల కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, చిట్ ఫండ్ కేసులు, రాజీయోగయమైన అన్ని క్రిమినల్ కేసులు పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని డబ్బు సమయాన్ని ఆదా చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జె.విజయనిర్మల, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ టీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



వైఎస్సార్‌టీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తోన్న ఏలూరు ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని, మేయర్ నూర్జహాన్, చిత్రంలో యూనియన్ రాష్ట్ర నాయకులు సుధీర్, జిలా అధ్యక్షుడు స్టీవెన్

ఏలూరు టౌన్: సమాజంలో ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ప్రతి విద్యార్థి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదనీ వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్లనాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నాని, నగర మేయర్ నూర్జహాన్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రభుత్వ విద్యరంగానికి స్వర్ణయుగం వచ్చిందని, నాడు-నేడు కార్యక్రమంలో స్కూళ్లన్నీ కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తోన్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉపాధ్యాయులు మరింత మెరుగైన రీతిలో విద్యార్థులు ఉత్తమ విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు గెడ్డం సుధీర్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్, ప్రధాన కార్యదర్శి మాసగిరి శ్రీనివాస్, కోశాధికారి వడ్లమూడి రామ్మోహన్, పీతల రవికుమార్, అన్నాజీరావు, రామారావు, అనిల్, మండల నాయకులు ఉన్నారు.

## ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ భరోసా

ఎమ్మెల్యే నానిని కలిసి జిల్లా వక్ఫ్‌బోర్డ్ నూతన కమిటీ



క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తోన్న వక్ఫ్‌బోర్డు నూతన కమిటీ

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీ వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని, పార్టీకోసం నిస్వార్థంగా కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తూ భరోసా ఇస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు నూతన కమిటీ ఎమ్మెల్యే ఆళ్లనానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, గజమాలతో సత్కరించారు. ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ కామిల్ జమ, ఉపాధ్యక్షుడు మహ్మద్ అక్బర్, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే నాని ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మైనార్టీలకు మీవంతు సేవలు అందించాలనీ, నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, వైఎస్సార్‌సీపీ నగర మైనార్టీ సెల్ నాయకులు మహ్మద్ రియాజ్, పలువురు ముస్లిం పెద్దలు తదితరులు ఉన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏలూరు కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేస్తున్న 108 ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): 108 సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెల నెలా జీతాలు చెల్లించేలా నిర్వహణ సంస్థను ప్రభుత్వం ఆదేశించాలని, అధిక పనిగంటలు చేయించుకోవడాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ నినాదాలు చేసారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 108 ఉద్యోగులను ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో విద్యార్హత ప్రమాణాలు కలిగినటువంటి 108 ఉద్యోగులకు సర్వీస్‌ను బట్టి వెయిటేజ్ మార్కులు అందించాలని కోరారు.అరబిందో మెడికల్ సర్వీసెస్ సంస్థ వచ్చాక వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సర్వీసులో పనిచేస్తున్న వారికి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగులపై ఒత్తిడిని తగ్గించాలని కోరారు. ఆందోళన అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కెఎం జయరావు, ఎస్.దినేష్, జి.రమేష్, ఉన్నారు.

## అసైన్డ్, సీలింగ్ భూములను పేదలకు ఇవ్వాలి



ఏలూరు కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కూలీలు

ఏలూరు (టూటౌన్): పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్, గయాళ భూములను వెంటనే పేదలకు ఇవ్వాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో గత ఎనిమిది నెలలుగా పేదలు పోరాటం చేస్తూ తమ భూములు తమకు ఇవ్వాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గత ఎనిమిది నెలల క్రితమే సర్వే చేయిస్తామని చెప్పిన రెవెన్యూ అధికారులు ఇంతవరకూ సర్వే నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. దళితులు, పేదల భూములు ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.ఆనందరావు ,వెంకటరమణ, లాజర్, మణి, జాన్‌రాజు, లక్ష్మీ, లలిత, నాగేంద్ర, మాణిక్యం, కుమారి, దేవకృపా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల ఆర్థిక న్యాయానికి సబ్ ప్లాన్ దోహదం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీల ఆర్థిక న్యాయానికి సబ్‌ప్లాన్ చట్టం దోహద పడుతుందని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉద్యోగుల సంక్షేమ భవనం నందు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మరో 10 సంవత్సరాలు పొడిగిస్తూ జీవో నెం.7ను విడుదల చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేసారు. దేశంలోనే మొదటి సారిగా సబ్‌ప్లాన్‌ను చట్టబద్ధతను సాధించుకున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. సబ్ ప్లాన్ కాలపరిమితి పొడిగింపు కొరకు గత ఆరు నెలలుగా ఉద్యమాలు చేసినట్లు చెప్పారు. చట్టం అమల్లోకి వచ్చిన అనంతరం చేసిన నిధుల కేటాయింపు, ఖర్చులు, వాటి ద్వారా దళిత గిరిజనుల్లో వచ్చిన గుణాత్మక మార్పులపై ప్రభుత్వం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో శ్వాత పత్రం విడుదల చేయాలని కోరారు. చట్టంలోని చాప్టర్ 5 సెక్షన్ 19(8) ప్రకారం సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై తనిఖీని నిర్వహించాలని గుర్తు చేశారు. సబ్ ప్లాన్ నిధుల్లో కనీసం 50 శాతం నిధులు దళిత, గిరిజనుల ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఖర్చు కాకుండా మిగిలిపోయిన నిధులను మరుసటి సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్‌కు అదనంగా కలిపి ఖర్చు చేయాలని చట్టంలోని సెక్షన్ 22(1) చెబుతుందన్నారు. నిధుల వినియోగంపై జిల్లా స్థాయి కమిటీలు పర్యవేక్షణ చేస్తూ సక్రమంగా వినియోగం అయ్యే విధంగా చూడాలని కోరారు. జిల్లా కమిటీల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల్లో ఒకరిని ఛైర్‌పర్సన్‌గా నియమించి, స్థానిక పౌర సంఘాల్లో ఎన్‌జీవోలకు చోటు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కన్వీనర్ సింగవరపు జ్యోతి, ఆర్ మణిసింగ్, మేతర అజయ్ బాబు, గోసాల ఝాన్సీ రాణి, బలే సురేష్, సోమ్లా నాయక్, పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్

కుక్కునూరు : మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కుక్కునూరు సీఐ కే వీ సత్యనారాయణ సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన ఓబినేని చంద్రశేఖర్ అలియాస్ శేఖర్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన వివాహిత ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో మహిళ నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తగిన ఆధారాలు సేకరించి నిందితుడిని ఆదివారం తన నివాసంలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

### రజకుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా రజకులు పడుతున్న ఇబ్బందులను, సమస్యలను పరిష్కరించాలని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. గోపాలపురం నియోజకవర్గం, దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంలో రజకుల ఊర చెరువు కరెంటు బిల్లు విషయంపై వచ్చిన సమస్యపై సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు రజకుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు గుంట్లుపల్లి నాంచారయ్య, పాలూరి సుబ్బారావు, గుట్టు పల్లి లక్ష్మణరావు, తాడిమల్లి లక్ష్మణరావు, కొమకుంట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.